


# మళ్లీ చిగిర్చిన వసంతం

ముదిగొండ వీరభద్రయ్య

[illegible] భర్త ఇంకా ఇంటికి రాకపోవడంతో సుశీల మనస్సు పరిపరివిధాలా పోయింది. ఎన్నడూలేని రకంగా ఇవేళ భాస్కరం ఇంత ఆలస్యం ఎందుకు చేస్తున్నాడు? రోజూ ఎనిమిది గంటలు దాటకుండానే ఇంటికి వచ్చే మనిషి అర్థరాత్రి పన్నెండు గంటలు దాటినా రాకపోవడానికి కారణమేమయి వుంటుంది?

సుశీల కిటికీ తలుపులు తీసి బైటి చీకట్లోకి చూసింది. హిమాయత్‌నగర్ నల్లమందు తిని పండుకొన్నది. దూరాన నౌబత్ పహాడ్ ప్రాణాలు పోతోన్న మానవుడిలా మినుకు మినుకు దీపాలతో వెలుగుతోంది.

చల్లని చలిగాలి ఒకటి రావడంతో సుశీల కిటికీ రెక్కలు మూసేసి మళ్లీ మంచంమీదవచ్చి కూర్చుంది. విలువైన ఆస్పెన్సర్ కంపెనీ బెడ్డూ—దానిమీద బెడ్ కవరూ — ఇవేళ సుశీలతో పాటుగా ఆమె భర్తయైన భాస్కరం కోసం ఎదురుచూస్తున్నవి.

'రాలేదు! భాస్కరం ఇంకా రాలేదు.' దుఃఖంతో పైకి అనేసిన సుశీల మాటలకి గోడగడియారం శృతి కలిపి తెల్లవారు జామున మూడు గంటలు కొట్టింది.

ఇంక నిబ్బరంగా ఉండలేక సుశీల పడకగది వదిలి గబగబా స్టెయిర్ కేస్ దిగి కాంపౌండ్‌లోకి వెళ్లి గేటు తెరిచి ఫుట్‌పాత్ మీద చాలాసేపు నిల్చుంది. ఇంతలో ఎవరో వెనుక కొంగు లాగినట్లయితే తిరిగి చూసింది భయంతో—

'అరె! రామూ వచ్చిందే తనవెంట' అంటూ ఆ ఆల్సేషియన్ కుక్కపిల్లతోపాటు కాంపౌండ్‌లోకి నడిచింది సుశీల. గేటునానుకొనివున్న కారుగ్యారేజి ఖాలీగా బోసిగా కనబడి ఆరాత్రి ఏదో భయాన్ని కలిగించిందామెకు. గబగబా ఆమె ఇంట్లోకి వచ్చి ముందు హాల్లో కాస్సేపు కూర్చుంది. అక్కడే సోఫాలో అలసటతో దుఃఖంతో సుశీల జారగిలబడింది. ఉదయం ఫోను మోగుతుంటే సుశీల ఉలిక్కిపడి లేచింది. కళ్లు తెరవగానే ఆమెకు తనభర్త ఇంకా ఇంటికి రాలేదనే ఆలోచనతోపాటు— బహుశః ఆఫోన్ ఆయనే రింగప్‌చేసి వుంటాడనే ఊహ కలిగి గబగబా మేడ మీదికి వెళ్లి రిసీవర్‌నెత్తింది. కాని అవతలివైపు నుంచి కంఠం వినిపించగానే సుశీల వుత్సాహమంతా నీరుగారి పోయింది. అది ఆమెభర్త భాస్కరం సీనియర్ లాయర్ నీలకంఠరావుగారి కంఠం! భాస్కరాన్ని వెంటనే తన ఇంటికి పంపవలసిందిగా ఆయన చెప్పాడు. రాత్రినుంచి భాస్కరం ఇంటికి రాలేదనీ రాగానే అలాగే పంపిస్తాననీ చెప్పింది సుశీల.

ఉదయం తొమ్మిది గంటలయింది.

భాస్కరం రాలేదు. వంట మనిషి టిఫినూ కాఫీ బెడ్‌రూమ్‌కే తెచ్చి టీపాయ్‌మీద పెట్టి వెళ్లింది. కాని దుఃఖంతో సుశీల టిఫిన్ తినలేకపోయింది. వీధిలో కారుహారన్ వినబడితేచాలు భాస్కరం వస్తు

బ్బాదేమోనని కిటికీ దగ్గరకు పరుగెత్తుకు వెళ్ళి చూస్తోంది సుశీల! కాని ప్రతిసారీ ఆమెకి ఆశా భంగమే అవుతోంది.

టేబిల్ మీద భాస్కరం ఫోటో సుశీలని గంభీరంగా చూస్తోంది. గడియారంలో ముళ్ళు నెమ్మది నెమ్మదిగా ఎగ్రబాకుతూ దిగ్రబాకుతూ వున్నవి. అవతల చలికాలపు ఎండ చల్లగా కాస్తోంది. పతే మైదాన్ క్లబ్బుకి ఫోన్ చేసింది సుశీల. అక్కడ ఎవరూ ఫోన్ని కనీసం రిసీవైనా చెయ్యలేదు. నీలకంఠరావుగారికోసం హైకోర్టుకి ఫోన్‌చేసింది. కాని ఆయన కోర్టుకి రాలేదని విని సుశీల ఆశ్చర్యపడి పోయింది.

ఏమైంది? భాస్కరం ఎక్కడికి వెళ్లివుంటాడు? సరిగ్గా భాస్కరం తనని వదిలి ఇరవైనాల్గు ఘంటలయింది. ఇంక సుశీలకి ధైర్యం చాలలేదు. గబగబా మొఖం కడుక్కుని పౌడరయినా వేసికోకుండా బైటకువచ్చి ఒక టాక్సీ తీసికొని నీలకంఠరావు గారింటికి వెళ్లింది. ఆయన ఇంట్లో లేకపోతే ఆయన కొడుకు రమాపతికైనా విషయం చెప్పి భాస్కరం జాడ తెలుసుకొనే ఏర్పాటు చేయిద్దామని ఆమె ఊహించింది. కాని అనుకొంది ఒకటీ— జరిగింది మరొకటీ!

కాలింగ్‌బెల్ నొక్కగానే సుశీల వయస్సుదే అయిన ఒక యువతి వచ్చి తలుపు తీసింది.

'నీలకంఠరావు గారున్నారా?'

'లేరు.'

'వారి అబ్బాయిగారు రమాపతి ఉన్నారా?'

'వారు మూడురోజులుగా సంజీవరావుగారి ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో వుంటున్నారు.'

'పోతే నీలకంఠరావుగారు కూడా అక్కడికే వెళ్లారా?'

'అవును' అన్నదాయువతి.

ఏం చేయాలో దిక్కుతోచక సుశీల టాక్సీలో ఇంటికి తిరిగి వచ్చింది. టాక్సీ దిగగానే కాంపౌండ్‌లో తమ కారు ఆగివుండడం చూసి పుట్టెడు సంతోషంతో సుశీల గబగబా టాక్సీదిగి వెయ్యిమైళ్ల వేగంతో లోపలికి పరుగెత్తింది. డ్రాయింగ్ రూమ్‌లో ఎవరో ఒక అపరిచిత వ్యక్తితోపాటు తన భర్త సీనియర్ నీలకంఠరావుగారు కూర్చుని వున్నా కనీసం నమస్కరించనైనా నమస్కరించక భర్తని చూద్దామన్న ఆదుర్దాతో వేగంగా మేడ మెట్లెక్కి సుశీల పడకగదిలోకి దౌడు తీసింది. అక్కడ భాస్కరం లేకపోవడంతో అతను బాత్ రూమ్‌లో వుండివుంటాడని భావించి చీరె మార్చుకుని నుదుట తిలకందిద్ది సుశీల నెమ్మదిగా కిందికి వచ్చింది— అతిథుల్నిసత్కరించడం కోసం!

ఆమె వచ్చేటప్పటికి నీలకంఠరావుగారు అటూ ఇటూ పచారు చేస్తున్నారు. సుశీల రాకని చూసి ఆయన అర్థవంతంగా ఆగిపోయారు.

'ఈయన డాక్టర్ సంజీవరావుగారు.'

'ఓహో అలాగా! మీ అబ్బాయి రమాపతిగారికున వద్దనే వైద్యం చేయించు కొంటున్నారు దూ!' అన్నది సుశీల.

ఆమాటతో నీలకంఠరావుగారు ఒక్కక్షణం స్తబ్దుడై పోయాడు. ఆయన ముఖంలో [illegible] నిండింది. డాక్టర్ సంజీవరావు మొగంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు. అది గమనించిన సుశీల ఏదో కీడు శంకించి 'ఏమైంది? అలా అయిపోయారు' అన్నది ఆశ్చర్యంగా.

'మీరొకసారి మా హాస్పిటల్‌కి రావాలి' అన్నాడు డాక్టర్ సంజీవరావు.

'అదేమిటి డాక్టరుగారూ! ఆరోగ్యంగా వున్న వాళ్లనికూడా మీ నర్సింగ్‌హోంలో జాయిన్ చేసికొంటారా ఏమిటి?' అన్నది నవ్వుతూ సుశీల.

'నువ్వోసారి వెంటనే హాస్పిటల్‌కి రావాలమ్మా' ఆమె మాటల్ని లక్ష్యపెట్టక గంభీరంగా అన్నాడు నీలకంఠరావు.

'సరే అలాగే వస్తాను. మా శ్రీవారు స్నానం చేస్తున్నట్టున్నారు.ఆయనస్నానమయ్యాకఅయినా, నేనూ కలిసి వస్తాం'అన్నది సుశీల వినయంగా.

నీలకంఠరావు సుశీలని సమీపించి—

'సుశీలా! నీభర్త కూడా అక్కడే వున్నాడు. నువ్వు అర్జంటుగా రావాలి.'

ఆ మాటతో సుశీల దిగాలుపడిపోయింది. వాళ్లతోకలిసి కాంపౌండ్‌లోని కారుదాకా వెళ్లింది. 'అరే ఇది తమకారుకాదే— ఇందాక పొరపాటున తమ కారనే అనుకొన్నాను' అనుకుంటూ లోపల కూర్చుంది. వీళ్లు తనని అర్జంటుగా నర్సింగ్ హోంకి ఎందుకు తీసికొని వెళ్తున్నారు? తానెవరికైనా అక్కడ రక్తదానం చేయాలా? తానలా రక్తదానం చేస్తే ఇప్పుడు తిరిగినంత ఆరోగ్యంగా ఇక ముందుకూడా వుండగలదా? రక్తదానం చేసిన వాళ్లకి తిరిగి రక్తం పెట్టడానికిగాను డాక్టర్లు ఓ పదిరోజులదాకా ఉచితంగా బత్తాయి పండ్లు ఇస్తారట! అయినా తాను బత్తాయి పళ్లు కొనుక్కోలేనంత బీదదా? మళ్లీ సుశీల మనస్సులోకి భాస్కరం వచ్చాడు— ఆ రోజల్లా భాస్కరం హాస్పిటల్‌లోనే వున్నాడా? బహుశః నీలకంఠరావు గారి అబ్బాయి రమాపతికి ఏదో సీరియస్ అయి ఉంటుంది. స్నేహితుడి దగ్గర ఉండిపోవాల్సి వచ్చివుంటుంది.

సంజీవ్ నర్సింగ్ హోం కాంపౌండ్‌లోకి కారువచ్చి ఆగింది. సంజీవరావు కారుదిగి తలుపు తీశాడు. సుశీలని కారుదిగమన్నట్టుగా! సుశీల కారు దిగింది. ఆమెకి ఒకవైపు నీలకంఠరావూ— మరోవైపు డాక్టర్ సంజీవరావూ నడిచారు. హాస్పిటల్ మూడో అంతస్తుకి లిఫ్ట్‌మీద వెళ్లారు. వార్డుల్లో నర్సులూ డాక్టర్లూ సంజీవరావుని చూసి విష్ చేస్తూ సుశీల వైపు భావగర్భితంగా చూశారు.

ఆ ముగ్గురూ మూడో అంతస్తులో నలభయి నాలుగో గదిలోకి వెళ్లారు. గదిలోకి వెళ్లగానే సుశీలకి ఎంత చల్లగా అనిపించింది. డోర్‌కి ఎదురుగా టేబిల్ మీద ఎవరినో పడుకోబెట్టి దుప్పటి కప్పినట్టున్నారు.

సుశీల భయంతో వాళ్లిద్దరితోపాటు ఆ టేబిల్ దగ్గరకు చేరింది. డాక్టరు సంజీవరావు టేబిల్‌మీద పండుకొని వున్న వ్యక్తి మొగం మీదనుంచి దుప్పటి తొలగించాడు.

సుశీల అతన్నిచూసి కెవ్వున కేకవేసి అతని గుండెల మీద వాలిపోయింది.

అతడే భాస్కరం.

ఆరోజల్లా అతనికోసమే సుశీల వేచి వున్నది.

ఇక ఆమె అతనికోసం వేచి వుండాల్సిన పనిలేదు.

పై లోకాల్లో అతనే ఆమెకోసం వేచి వుంటాడేమో?

ఆరోజల్లా సుశీల బంధువులు వచ్చారు. ఆమె తల్లీ తండ్రీ అన్నగారైన డాక్టర్ నాగమణి సుశీలని ఓదార్చారు.

డాక్టర్ నాగమణి సుశీలని ఓదార్చి తన బావగారి కారు ఆక్సిడెంట్ వివరాల్ని, సంజీవరావు చేసిన చికిత్సని తెలిసికొన్నాడు. అతని మనస్సులో ఏదో అనుమానం కల్గింది. వెంటనే అతని తండ్రికి చెప్పి బావగారి అంత్యక్రియల్ని తాను వచ్చేవరకు ఆపివుంచవలసిందని కోరి తనకి కాలేజీలో ప్రొఫెసరూ ఉస్మానియా హాస్పిటల్‌లో పెద్ద సర్జనూ ఐన డాక్టరు దాస్ గుప్తగారిని కలిసి తనకి కలిగిన అనుమానాన్ని వెలిబుచ్చాడు. ఆయన వెంటనే అతనితోబాటు వచ్చి భాస్కరం శవాన్ని నిశితంగా పరిశీలించాడు. భాస్కరం వక్షస్థలంవద్ద ఓపెన్ మెథడ్ ఆపరేషన్‌తో అతని గుండెని ఎవరో దొంగిలించారు! భాస్కరం శరీరంలో అతని గుండె లేదు!

డాక్టర్ దాస్‌గుప్త పోలీసులకి ఫోన్‌చేసి పోస్ట్ మార్టమ్ రిపోర్ట్ వ్రాసి భాస్కరం శవాన్ని అతన్ని కుటుంబానికి అప్పగించాడు.

వివాహమయి మూడు నెలలయినా కాలేదు! కాని సుశీల విగత భర్తృ అయిపోయింది.

ఈ కథ ఇక్కడికి ముగియలేదు!

ఇక్కడినుంచే ప్రారంభమైంది.

*　　*　　*

డాక్టరు సంజీవరావుని పోలీసులు అరెస్ట్ చేశారు. అతనిమీద పోలీసులు చార్జిషీట్ తయారు చేసి మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో కేసుపెట్టారు. హైదరాబాద్ నగరమంతా ఆవార్త బాంబులా పేలింది. వార్తాపత్రికలన్నీ ఒకేరోజున— 'డాక్టర్ సంజీవరావుగారు చేసిన గుండెమార్పిడి ఆపరేషన్ విజయం'—అనే వార్తనీ 'హత్యానేరం, గుండెని దొంగిలించిన నేరం ఆరోపించి డాక్టరు సంజీవరావుని అరెస్ట్ చేశారు'—అనే వార్తనీ పతాక శీర్షికలుగా ప్రచురించినవి.

ఎన్నడూ మేజిస్ట్రేట్ కోర్టుకి రాని అడ్వొకేట్ నీలకంఠరావు కోర్టుకి వచ్చి విశ్వప్రయత్నంమీద డాక్టర్ సంజీవరావుని బెయిల్‌మీద విడుదల చేయించాడు.

ఆనాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చార్జిషీట్ చదివాడు. కోర్టంతా నిశ్శబ్దమైంది. ఆ ఆశ్చర్యాన్ని స్వయంగా అనుభవిద్దామని ఎందరెందరో గొప్పవాళ్లు కార్లల్లోవచ్చి సికింద్రాబాద్ మేజిస్ట్రేట్ కోర్టులో కిటకిటలాడిపోయారు. చార్జిషీట్ చదువుతున్నంత సేపూ వాళ్లంతా నిశ్శబ్దంగా వుండిపోయారు.

—'హైదరాబాద్ నగరంలోని సంజీవ్‌నర్సింగ్ హోమ్ అధికారి— డాక్టర్ కొల్లా సంజీవరావు—; కొల్లా ప్రభాకరంగారి కుమారుడు—ప్రముఖలాయరు తన స్నేహితుడై అయిన పన్నగాల నీలకంఠరావుగారి

పోకింది. ఆ దృశ్యం చూడగానే సుశీలకి దిగ్భ్రాంతి కలిగింది. ఇదివరకు రమాపతి ఎప్పుడు తమ ఇంట్లోకి వచ్చినా భవ్ భవ్ అని అతనిమీదికి ఎగిరేది. కాని ఇవాళ—

'వెళ్లివస్తాను' అంటూ నమస్కరించి రమాపతి వెళ్లిపోయాడు. సుశీల మనస్సులో అనేక ఆలోచనలు ముసిరినవి. ఇంతపెద్ద మేడలో తానెంత ఒంటరి! పైకివెళ్లి బెడ్‌మీద వాలింది. పద్మకి బదులు రమాపతి రావడం—అతనే కారు డ్రైవ్ చేయడం—కారు రాగానే ఎన్నడగాలేనిది రాము అతనిపాదాల్ని నాకడం ఇవన్నీ భాస్కరాన్ని గుర్తుకు తెచ్చినవి సుశీలకి! కాని.. కాని. . . . . . .గ్యారేజిలో భాస్కరంలాగా . . . . హే భగవాన్! ఈ మొండి బ్రతుకు ఎన్నాళ్ళు నాకు? దిండులో తల దూర్చి దుఃఖించింది సుశీల.

ఆ రోజున పోలీస్ ఆఫీసర్ ఇంటికి వచ్చాడు. ఆ కేసు బలే ఇంటరెస్ట్ అయిన కేసనీ తాను శిక్షణ ఇచ్చినట్లుగా సుశీల, చీఫ్ ఎవిడెన్స్ ఇస్తే సంజీవరావు నేరస్తుడనే విషయాన్ని జడ్జిగారికి నమ్ముతారని చెప్పి వెళ్ళాడతను.


కేసు ఇంటరెస్టట! హు ! జడ్జిగారు నమ్ముతారట! అంతే గాని డాక్టర్ సంజీవరావు నిజంగా నేరం చేసిందీ లేనిదీ ఆ ఆఫీసర్‌కి పట్టి లేదు! ఆ మధ్యాహ్నం ఆమె అన్నగారు డాక్టరు నాగమణి చెల్లెలికి ఫోను చేశాడు. మరో పది రోజులకి సెషన్స్‌లో ఎవిడెన్స్‌లూ ఆర్గ్యుమెంట్లూ ప్రారంభిస్తారనీ తాను వచ్చి అన్ని విషయాలూ మాట్లాడ్తాననీ చెప్పాడతను! అంతే తప్ప విధవయైన తన చెల్లెలి మనస్సులో ఏ ప్రభంజనాలు వీస్తున్నవో? ఎన్నెన్ని భూకంపాలు కల్గుతున్నవో? మోడువారిన ఆమె జీవన వృక్షం వసంతం కోసం అర్రులు చాస్తున్నదో? లేదో? అనే ఆలోచనలే అతనికి పట్టలేదు! ఛీ! ఈ ధనవంతుల ఇళ్లలో పుట్టిన దానికన్నా కూలీ నాలీ చేసికొని బ్రతికే వాళ్లిళ్లలో పుడ్తే నన్నా కాస్త మానవత్వం వున్న మనుష్యులు లభించి వుండేవాళ్లు!— సుశీల కిటికీ దగ్గర నిల్చుని కాంపౌండ్ క్రోటన్స్‌ని చూస్తూ ఆలోచిస్తోంది. అంతలో రమాపతి కారులో రావడం గమనించింది సుశీల. అతను ముందు హాల్లో సోఫాలో కూర్చుని తన కోసం మనిషిని పంపిస్తాడు పైకి— అనుకొంటూ కుర్చీలో కూర్చుంది సుశీల! కాని మనిషికి బదులుగా రాము సంతోషంగా పైకి వచ్చి సుశీల చేయి నాకి పమిట పట్టుకొని - లాగింది. కాని సుశీల కదల కుండా అక్కడే కూర్చుండి పోయింది.. రాము ఎంతో అల్లరి చేసి ఇంక సుశీలని కిందికి తీసికొని పోవడం అసంభవమనుకొన్నదేమో తోక ముడుచుకొని తానే కిందికి వెళ్లింది. మరుక్షణంలో రమాపతి సుశీల గదిలో వున్నాడు. అతని చేతిలో ఏదో పాకెట్ వుంది!

అత నామెచేతిలో ఆ పాకెట్‌ను ఉంచి —

'ఇవేళ మీరు నా యీ కానుకని అంగీకరించాలి' అన్నాడు. సుశీల నిర్లిప్తంగా దాన్ని స్వీకరించి టేబిల్ మీద పెట్టేసింది. 'లోపల విప్పి చూడండి' అన్నాడతను తలదించుకొంటూ.

'విగత భర్తృక పరాయి మొగాళ్ళ కానుకల్ని స్వీకరించడం మర్యాద కాదు.' అన్నాదామె కిటికీ లోంచి బైటకు చూస్తూ.

రమాపతి వంచిన తల ఎత్తలేదు.




ఇద్దరూ మౌనంగానే వుండిపోయారు.

అంతలో రాము ఆ ప్యాకేజి కవర్‌ని లాగేయాగా లోపలి ముద్దమందారం రంగు పీతాంబరం బయట పడింది. అది కళ్ళబడగానే సుశీల కళ్లు జిగేల్ మన్నవి. ఆమెకి తన హృదయం ఆగిపోయినట్లయింది. ఆ ఆవేశాన్ని ఆపుకోలేక ఆమె ఒక్కసారిగా లోపలి గదిలోకి పరుగెత్తుక వెళ్లింది — 'హే భగవంతుడా! ఈ రమాపతి..... ....అచ్చం నా భాస్కరంలాగే ప్రవర్తిస్తున్నాడు..... లేకపోతే నాకీ ముద్ద మందారం రంగు నచ్చుతుందని ఇతని కెట్లా తెలుసు? హోహో!'— ఆమె కళ్ళలోంచి కన్నీటి వరద పారింది. ఆమె ఆ గదిలో అలా దుఃఖించి దుఃఖించి చాలా సేపటికి ముందరి గదిలోకి వచ్చింది. రమాపతి ఇంకా అలాగే తలవంచుకొని నిలబడ్డాడక్కడ!

'మీ రింకా ఇక్కడే వున్నారా?'

అతను శిరస్సు నెత్తాడు. అతని కళ్లు బాష్ప పూరితాలయి వున్నవి.

'అవును. నేను తప్పు చేస్తే క్షమించండి. నాకు గుండెనిచ్చి జీవం పోసిన ప్రాణమిత్రుడి భార్యకి కానుక నివ్వడం తప్పే అయితే.....' అతని కంఠం గాద్గద్యంతో వణికి ఆగిపోయింది.

సుశీల మౌనంగా అతని వద్దకి వచ్చి 'క్షమించండి' అన్నది. అతను సెలవు దీసికొని నెమ్మదిగా మెట్లుదిగి వెళ్లిపోయాడు.

ఆనాడు కోర్టులో డాక్టర్ సంజీవరావుని చీఫ్ ఎక్సామినేషన్ చేశారు.

'డాక్టర్! మీరీ వృత్తిలో చేరిన నాటి నుంచి ఎన్ని ఆపరేషన్‌లు చేసివుంటారు?'

'లెక్క పెట్టలేదు గాని సుమారొక వెయ్యి దాటి వుంటవి?' అన్నాడా డాక్టర్.

'వాటిలో ఏ కేసయినా ఫెయిలయిందా?'

'ఫెయిలవుతే అంతవుంది నా దగ్గర కెందుకు వస్తారండీ?'

'జీవితంలో ఎన్నడైనా మీరు నేరం చేశారా?'

'నోస్సర్!' అన్నాడు డాక్టరు సంజీవరావు దృఢంగా.

ఎక్సామినేషన్ చాలించి నీలకంఠరావు ప్రాసిక్యూటర్ వైపుకి చూశాడు—క్రాస్ ఎక్సామ్ చేసికో వచ్చు నన్నట్లు —

ప్రాసిక్యూటర్ లేచి

'డాక్టర్! మీరింతవరకు ఏమాత్రం సంపాదించి వుంటారు?' నెమ్మదిగా అడిగాడు.

'పది లక్షలదాకా!' అన్నాడు డాక్టర్.

'అందులో నీలకంఠరావుగారు ఫీజుగా ఇచ్చినవి ఎన్ని లక్షలో?'

ఆ ప్రశ్నకి నీలకంఠరావు కోపంగా లేచి

'ఐ అబ్జెక్ట్ మైలార్డ్! నన్నూ, నా క్లయింటునూ ప్రాసిక్యూటర్ అవమానిస్తున్నారు.'

'అబ్జెక్షన్ రూల్డ్ అవుట్. ప్రొసీడ్.' న్యాయాధికారి డెసిషన్ ఇచ్చారు.

'ఇంతవరకు నీలకంఠరావుగారి దగ్గరి నుంచి ఒక్క పైసా అయినా తీసికోలేదు.'

'ఐతే ధర్మానికి చేశారా?' ఎక సెక్కంగా అడిగాడాయన.

'ఒక జీవిని మృత్యువు నుంచి రక్షిద్దామని చేశాను.' అన్నాడు డాక్టరు నిబ్బరంతో.

'ఒకరికి ప్రాణమిచ్చి మరొకరి ప్రాణం తీయమని ఏ ధర్మ శాస్త్రం చెప్పింది?' కఠినంగా అడిగాడు ప్రాసిక్యూటర్.

'నే నెవరి ప్రాణాన్నీ తీయలేదు. భాస్కరం గారి గుండెని మాత్రమే నేను తీసింది.'

'మీ గుండెని మరో డాక్టరెవరైనా తీస్తే ఊరుకొంటారా మీరు?' కోపంగా అడిగాడు ప్రాసిక్యూటరు.

'నేను చచ్చాక ఎవరి ప్రాణాన్నైనా రక్షించడం కోసం నా గుండెని తీసికొంటే ఊరుకొంటాను. అంతేకాదు. ప్రపంచ ప్రజలందరూ అలా తమ హృదయాల్ని దానంచేస్తే ఈ లోకంలో గుండె జబ్బులుండవనీ తద్వారా లోక కళ్యాణం జరుగుతుందనీ ఘంటాపథంగా చెప్పగలను.'

వెంటనే ప్రాసిక్యూటర్ డయాస్ కిందికి వచ్చి జడ్జిగారిని చూస్తూ

'మైలార్డ్స్, దయచేసి ఈ విషయం నోట్ చేయండి! తన గుండెనేమో ఈయన తన మరణానంతరం తీసికోనిస్తాడట— కాని భాస్కరం గారి గుండెని మాత్రం అతనికి మృత్యువు ప్రాప్తించక ముందే తీసికొన్నాడీ మహానుభావుడు! దిస్ క్లియర్లీ షోస్ దట్ మిస్టర్ భాస్కరం వాస్ మర్డర్డ్ బై దిస్ డాక్టర్.'

సమయం కావడంతో ఆ నాటికి కోర్టు లేచింది. జనసుంతా దిగ్భ్రాంతితో ఏం జరగనున్నదో అని కుతూహలంతో లేచారు.

సుశీల ఆనాడు కోర్టుకి రాలేదు. ఆ సాయంకాలం రమాపతి ఆమె వద్దకి వచ్చాడు. అతనికి సోఫా చూపించి కూర్చోమన్నది సుశీల. అతను కూర్చోక ఆమెనే చూస్తూ నిలబడ్డాడు.

"ఏం అలా చూస్తావు రమాపతీ?"

"మేమీ కేస్ వోడిపోతాం."

"పోతే నాకేం?" గంభీరంగా కిటికీలోంచి బైటకు చూస్తూ అన్నది సుశీల.

"అప్పుడు నీ భాస్కరం గుండె నీకు తిరిగి లభిస్తుంది." అని అతను గబగబా అవతలకి వెళ్ళిపోయాడు.

ఏమీ అర్థం కాక సుశీల నిశ్చేష్టురాలై నిలుచుండిపోయింది.

ఆ మర్నాడు డాక్టర్ సంజీవరావుని క్రాస్ ఎక్జామిన్ చేయడం తిరిగి మొదలయింది.

"భాస్కరం గుండెని తీసికోవడానికి అతని అనుమతిని మీరు తీసికొన్నారా?"

"లేదు."

"ఎందుకు?" గద్దించి అడిగాడు ప్రాసిక్యూటర్.

"చచ్చినవాణ్ని ఎలా అనుమతి కోసం మాట్లాడించను".

"అప్పటికే భాస్కరం చచ్చిపోయాడా ?" జడ్జి గారడిగారు.

"మైలార్డ్! మృత్యువు కింకా నిర్వచనం పూర్తి కాలేదు. మొన్ననే సిడ్నీలో ఇంటర్నేషనల్ ఫిజిషియన్స్ అంతా సమావేశమయి మృత్యువుని నిర్వచించడానికి ప్రయత్నం చేశారు." అన్నాడు డాక్టర్.

"పోతే మీరు చేసికొన్న నిర్వచనాన్ని బట్టి భాస్కరం మీ దగ్గరకు చచ్చిపోయాకే వచ్చాడంటారు?" ప్రాసిక్యూటర్ ఎంతో తెలివిగా అడిగాడు!

"అవును!" అన్నాడు డాక్టర్.

"అయితే మీరు మరణించిన ఏ మనిషి గుండెనయినా తీసి దాన్ని ఇలా హృద్రోగులకి వాడగలరా?"

డాక్టర్ సంజీవరావు గారి జవాబు కోసం కుతూహలంతో జడ్జీగారి నుంచి అమీనా వరకు అందరూ చూశారు. సుశీల తల వంచుకొని కూర్చుంది.

సంజీవరావు జవాబు చెప్పకపోయేటప్పటికి ప్రాసిక్యూటరే తిరిగి అడిగాడు.

"భాస్కరం గుండెని మీరు తీసి వేసే సమయానికి అతని గుండె కొట్టుకొంటున్నదా లేదా?"

"కొట్టుకొంటోంది!"

కోర్టంతా సూది వేస్తే వినబడేటంత నిశ్శబ్దంగా కూర్చుంది.


"మైలార్డ్! గుండె కొట్టుకొంటుండగా భాస్కరం ఎలా చచ్చిన వాడైనాడు? డాక్టర్ సంజీవరావు ఒట్టి హత్యనే కాదు గుండెని దొంగతనం కూడా చేశాడు—డియర్ డాక్టర్ మీరింక వెళ్ళిపోవచ్చు." అని ప్రాసిక్యూటర్ విజయ గర్వంతో రమాపతిని ఎక్జామిన్ చేయడం కోసం పిలిపించాడు. అన్ని లాంఛనాలు ముగిశాక—

"మీ పేరు?" అని అడిగాడు ప్రాసిక్యూటర్.

రమాపతి సమాధానం చెప్పలేదు. మళ్ళీ అదే ప్రశ్నని రెట్టించి అడిగాడు ప్రాసిక్యూటర్. రమాపతి సమాధానం చెప్పలేదు. అతను మౌనంగా అలాగే బోనులో నిలబడ్డాడు.

"ఇది కోర్టు ధిక్కరణ నేరం" గర్జించాడు ప్రాసిక్యూటర్.

"అలా అయితే నా పేరు చెప్తాను."




"చెప్పమనే అడిగేది." ఎకసెక్కెంగా అన్నాడు ప్రాసిక్యూటర్.

"నా పేరు భాస్కరం."

కోర్టంతా దద్దరిల్లిపోయిందా జవాబుతో. సుశీల రమాకాంత్‌ని వెర్రిగా చూసింది. నీలకంఠరావు ఆశ్చర్యంగా చూశాడు తన కొడుకుని.

"అవుతే మీకు రెండు పేర్లున్నయ్యా?"

"నాకు రెండు జన్మలూ! రెండు పేర్లూ!" అన్నాడు రమాపతి గంభీరంగా.

కోర్టంతా నిస్తబ్ధమైపోయింది.

ఇంతలో నీలకంఠరావు కేదో పాయింట్ తోచి గభాల్ని లేచి—

"మైలార్డ్! ఇప్పుడు భాస్కరం బ్రదికే వున్నాడు." అన్నాడాయన.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎకసక్కెంగా నవ్వాడు.

"నవ్వకండి ప్రాసిక్యూటర్! గుండె కొట్టుకొంటున్నది కాబట్టి భాస్కరం బ్రతికే వున్నట్టు జస్టు—ఇందాకనే మీరు సిద్ధాంతం చేశారు."

"అవును! అవుతే?" అన్నాడు ప్రాసిక్యూటర్.

"అవులే—మైలార్డ్! నేను చెప్పబోయే ఈ పాయింట్‌ని దయచేసి జాగ్రత్తగా నోట్ చేయండి. భాస్కరం గుండె ఇంతవరకు ఆగలేదు! నా కొడుకు రమాపతి గుండెనే ఆగింది! భాస్కరం శరీరం మార్చాడు! కాని నా కొడుకు రమాపతి చచ్చిపోయాడు! నా కిప్పుడు మిగిలింది వాడి శరీరమే!" కోర్టంతా హర్షధ్వానాలతో దద్దరిల్లిపోయింది.

ఈ విషయం మీద న్యాయశాస్త్రం ఇంకా ఏ సిద్ధాంతమూ సిద్ధం చేయలేదనీ — ఒక కొత్త సమస్యని లోకులు పాత ప్రమాణాలతో పరిశీలించవద్దనీ - ఈ కేసుని కొట్టి వేస్తున్నాననీ జడ్జిగారు చెప్పి ఆనాటికి విచారణ చాలించారు.

సుశీల కారు దగ్గరకు వెళ్ళింది. ఆమెని వెన్నంటి రమాపతి వచ్చాడు.

"సుశీలా!"

"ఏమిటి రమాపతీ!"

"నీతో నేనూ వస్తాను పద!"

రమాపతి డ్రైవ్ చేస్తున్నాడు. కారు నెమ్మది నెమ్మదిగా హిమాయత్‌నగర్ చేరింది. అప్పటికే చీకటి పడిపోయింది. బయట వాన కురుస్తోంది. గేట్లోంచి కారు లోపలికి వచ్చి గ్యారేజిలోకి వెళ్ళి ఆగింది. ఒక్కక్షణం పాటు ఇద్దరూ కార్లోనే కూర్చుండిపోయారు.

తర్వాత రమాకాంత్ లేచి బ్యాక్ డోర్ తీసి సుశీలని దిగమన్నాడు.

ఆమె దిగగానే అతను విండో గ్లాసెస్ పైకి ఎక్కించి కారు మెషిన్ లాక్ చేసి హెడ్ లైట్స్ ఆఫ్ చేశాడు. ఆ చీకటిలో సుశీలకి భాస్కరం గుండె మునుపటిలా కొట్టుకుంటుండడం వినిపించింది!